# పాపం రాధ!

రాధ మస్తాబు ముగించబోయేముందు బొట్టు పెట్టుకోటానికి చేతితో కుంకుమ తీసుకొని నిలువుటద్దంలోకి చూసేసరికి వెనక గుమ్మంలో నిలబడి తనని తదేకంగా చూస్తున్న కేశవరావు కన్పించాడు. చటుక్కున బొట్టుపెట్టుకోవటం ఆపి వేళ్ళమధ్య కుంకుమ పట్టుకొని వెనక్కి తిరిగి నవ్వింది. "ఎంతసేపైంది వచ్చి? నే చూడనే లేదు" అంది నవ్వుతూ.

"ఊఁ! ముందు బొట్టుపెట్టుకో!"

రాధ అద్దం వేపు తిరిగి బొట్టుపెట్టుకుంటుంటే గదిలో మడత కుర్చీలో కూర్చుంటూ అన్నాడు కేశవ— "నీ కుంకుమకి ఆయుష్యుంది రాధా!"

రాధ పైటచెంగుకు వేళ్ళు తుడుచుకుంటూ వింతగా చూసింది.

"నిజంగా నువ్వదృష్టవంతురాలివి." కాలిమీద కాలు వేసుకుంటూ వెనక్కి జేరపడ్డాడు. అప్పుడే కేశవ కుడిపాదాని కున్న ఎర్రటి కట్టు రాధ కళ్ళబడింది.

"ఏమిటిది? ఎలా తగిలింది?" ఆత్రృతగా కుర్చీ దగ్గర కూర్చుని కేశవ పాదం చేతిలోకి తీసుకుంది.

"ఎంతో ప్రమాదం తప్పిపోయింది రాధా! లేకపోతే ఈ పాటికి నే నేలోకంలో వుండేవాణ్ణో! నువ్వూ అమ్మా నా శవం దగ్గర...." కేశవ కళ్ళు మూసుకున్నాడు.

రాధ నిర్ఘాంతపోయి వివరాలేవీ అడగకుండా ఆశ్చర్యంగా చూస్తూ వూరుకుంది.

కేశవ తిరిగి అన్నాడు. "ఎప్పుడూ అంత పరధ్యానంగా వుండ లేదు. ఏదో ఆలోచిస్తూ వస్తుంటే హారన్ మ్రోగినా వినిపించలేదు,

వెంట్రుక వాసిలో దూసుకుపోయింది లారీ. డ్రైవరు దిగివచ్చి సన్నసన్నగా చివాట్లెట్టాడు. అక్కడ చేరిన వాళ్ళంతా నన్నే అన్నారు. కాలికి దెబ్బ తగిలి నెత్తురు చాలా కారింది. ఏమిటో నా కంతా అయోమయమై పోయింది. రిక్షాలో హాస్పిటల్‌కి వెళ్ళివచ్చాను. క్షణంలో ఏం జరుగు తుందో తెలియదు కదా? భగవంతుడి దయవల్ల జరగలే దనుకో. కాని అలా జరిగితే ఈపాటి కెలా వుండేది? నే నొస్తానని గంపె డాశతో ముస్తాబు చేసుకుంటున్న నువ్వేమయ్యేదానివి? ఈ బొట్టు, ఈ గాజులు...." కేశవ కాలు కిందమోపి రాధ చేతులు తన చేతుల్లోకి తీసుకొని గాజులు సవరించాడు. రాధ కళ్ళు చెమర్చాయి. "మరి చాను. పువ్వులివిగో, రోజూలా నే ఇవ్వాళా తెచ్చాను." జేబులోంచి పొట్లం తీసి విప్పుతూంటే అలవాటుగా వెనక్కి తిరిగింది రాధ. మూడు గులాబీల గుత్తి రాధ తలలో పెడుతూ అన్నాడు కేశవ— "అలా జరిగితే ఈ పువ్వు లెవరు పెడతారు నీకు?"

"అబ్బా! ఏమిటదీ, ప్రస్తుతం సుఖంగా వున్నందుకు సంతో షించక, దేన్నో తలచుకొని బాధపడతా రేమిటీ? అంతా నా భాగ్యం. నా పసుపు కుంకుమలకి ఆయువుంది. అస్తమానూ అలా అనకండి" జడ మీదికి చెయ్యిపోనిచ్చి పూలు సర్దుకుంది. చూస్తూ కూర్చున్నాడు కేశవ.

రాధ లేచి లోపలికెళ్ళి సమాచారం అత్తగారితో చెప్పింది. ఆవిడ గదిలోకొచ్చి కంగారుగా కొడుకుని పరీక్షించింది. కళ్ళుమూసుకొని వెనక్కి జారబడివున్న కేశవ నుదుటిమీద చల్లని స్పర్శకి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. కేశవతల్లి కళ్ళల్లో నీళ్లు నిండివున్నాయి.

"తెల్లారిలేచి ఎవరిమొహం చూశావో'' నడిబజార్లో పరాకు లేమిటి? ఎంత గొడవ తప్పిపోయింది. నా కడుపు చలవే నిన్ను కాపాడింది. ఇంతకీ దాని పుస్తె గట్టిది. ఎలా వుంది కాలు? బాగా బాధగా వుందా? పెద్ద దెబ్బే తగిలిందా?''.... కాలు నిమిరింది ఆదుర్దాగా. "అబ్బే! లేదమ్మా! కాస్త ఇదమ్మా. రోజూ ఇలాంటి వెన్నో జరుగుతుంటాయి. పెద్దదానివి, నువ్వా అంత ఇదవుతావేం!" తల్లి చేతుల్లోంచి కాలు కిందబెడుతూ అన్నాడు కేశవ.

"కంగారు మేము పడకపోతే ఎవరు పడతార్రా? ఇంత దాన్నయి ఇప్పు డిటువంటి గొడవలు చూడాలంటే నాకు బాధ కాదూ?"

"బావుంద త్తయ్యా! ఆయనసలే ఏమిటేమిటో తల్చుకొని బాధ పడుతుంటే మీరు ధైర్యం చెప్పాల్సింది పోయి, ఇంకా అధైర్య పుచ్చు తారేం? కష్టాలు కావాలని తెచ్చుకోము. దురదృష్టవంతులైతే వాటికవే వస్తాయి. ఏదీ మనకేం అశుభం జరగలేదు. అంతా సుఖంగా వున్నాం" అంది రాధ కొంచెం విసురుగా.

"నీ కింకా చిన్నతనం రాధా! వాడ్ని గురించి నీకు బాధ వుంటుంది. కానీ ఈవయసులో అంత పట్టించుకోవు. పైకి అనుకోకపోతే కడుపులో వేధిస్తూ వుంటుంది.— దానికేం గానీ నువ్వు మంచ మీద పడుకో అబ్బాయ్! ఈ పూట స్నానం వద్దు— ఏమీ వద్దు" అంది తల్లి.

"ఏకంగా భోంచేసి పడుకోవచ్చు కదూ!" అంది రాధ.

నా కాకలిగాలేదు. ఈ పూటకి వద్దులే''—కుర్చీలోంచి లేచి పరుపు మీద కూర్చున్నాడు.

''ఆకలెందుకుండదూ! ఏదో అనారోగ్యంగా వున్నట్టు అన్నం మానుకోటం ఏమిటీ? మీరు వంటింట్లోకి రాలేకపోతే యిక్కడికే అన్నం తెస్తాను" అంది రాధ.

"అబ్బే. వద్దు రాధా! నిజంగా నాకీ పూట అన్నం తినాలని లేదు. మీరెళ్ళి తినండి. వచ్చేటప్పుడు కాఫీ తీసుకురా."

''పోనీలే. వాడికి అన్నంమీద లేకపోతే వద్దు. ఒళ్లు కాస్త వెచ్చగా వున్నట్లుంది. మానెయ్యటమే మంచిది. పాలు వెచ్చబెట్టి తెచ్చిపెట్టు దృఢంగా వుంటుంది. పద. మనిద్దరం తిందాం. అంతా అన్నాలు మానటం శుభం కాదు.''

రాధ అత్తగారి వెనకాలే వెళ్ళింది. తిరిగి పాల గ్లాసుతోటి, మంచి నీళ్ళతోటి వచ్చేసరికి కేశవకి కునుకు పట్టింది. లేపి పాలు యిచ్చింది. చలిగాలి కొడుతూంటే కిటికీ రెక్కలు మూసి దీపం తగ్గించి వచ్చి పడుకుంది రాధ.

"మీ ఒళ్ళు వేడిగా వుంది. ఇది జ్వరమేనా? ఇందాకే డాక్టర్నడిగి మందు తీసుకోవలసింది—" అంది ఒళ్ళు నిమురుతూ.

"అప్పటికేమీ లేదు. కాలు కూడా ఇప్పుడు కొంచెం బాధగా వుంది."

"ఈ దెబ్బను గురించే జ్వరం వచ్చివుంటుంది. తెగ ఆలోచించ కుండా నిశ్చింతగా నిద్రపోతే తెల్లారికి మామూలుగా వుంటుంది. వారం రోజుల్లో దెబ్బకూడా మానిపోతుంది – ఇంత చిన్న విషయానికి తల బద్దలు కొట్టుకోవటం—— విపరీతంగా ఆలోచించటం నా మట్టుకు నాకు విచిత్రంగానే వుంది. మగవాళ్ళెక్కడైనా ఇలా బెంబేలు పడతారా?" లేచి కూర్చుని మృదువుగా పాదం ఒత్తసాగింది రాధ.

కేశవ మౌనంగా పడుకున్నాడు చాలాసేపు. ఎప్పుడూ హుషారుగా కబుర్లు చెప్పి నవ్వించే మనిషి ఇవ్వాళ వచ్చిన దగ్గర్నుంచీ ఇంత నిశ్శబ్దంగా వుండటం రాధకి చాలా చిత్రం అనిపించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? కాలు బాధగా వుందా?"

"లేదు."

"మరి?"

"ఏం లేదు రాధా!"

"కాదు నాకు తెలుసు. సాయంత్రం గొడవ గురించే కదూ?" పక్కకుచేరి అనునయంగా అడిగింది. కేశవ మాటాడలేదు.

"ఎందుకంత బాధపడతారు? మీ రిప్పుడు సుఖంగానే వున్నారు కదా?"

"నేను ఆలోచించేది నా గురించి కాదు——నీ గురించి."

"నేను బాగానే వున్నానుకదా? మరింతగా ఆలోచించాల్సిన ఆపదేం వచ్చింది మనకి? దేవుడి దయవల్ల ఈ క్షణంవరకూ క్షేమంగా వున్నాం. ఇక జరిగేదే...."

"ఆ జరిగేదే ఆలోచిస్తున్నాను రాధా!"

"మెరుగే, చదవేస్తే వున్నమతి పోయిందని, బావుంది వరుస. లోకంలో అంతా రాబోయే గొడవలన్నీ తల్చుకుని భీతుళ్ళా ఇంటెల్ల

పాదినీ హడలగొట్టటం లేదు. ఇలా తెగ ఆలోచించి ఏం చేస్తారు? జరిగే దాన్ని ఆపుచేస్తారా? పిచ్చిపిచ్చి ఆలోచన్లు మానేసి...."

"మీ ఆడవాళ్ళు చిత్రమైన మనుషులు రాధా! అరిటాకూ ముల్లూ సామెతలా ఏది జరిగినా మీకే ముప్పు. ఐనా వాటినే మీరు ఆనందంగా అనుభవిస్తారు."

"ఏమిటి మీరనేది? నాకేం అర్థం కావటంలేదు.

"నిజం, నాకే సరిగా అర్థం కావటంలేదు. ఈ విషయం నే నెప్పుడూ ఇంత సీరియస్‌గా తీసుకోలేదు. అవసరంకూడా రాలేదు — రాధా! మనిద్దరికీ ఏమిటీ బంధం? నేను వున్నంతకాలం నువ్వూ ఒక మనిషిగా లెక్క. నేనే లేకపోతే నువ్వూ లేనట్టేకదూ! నీ కసలు వ్యక్తిగతంగా ఒక విలువంటూ ఉందా?"

"అబ్బా! మీరేం చెపుతున్నారో నాకసలు బోధపడటంలేదు. అంత పెద్ద పెద్ద మాటలుచెపితే అర్థం చేసుకోటానికి నే నంతగా చదువుకున్న దాన్ని కాదు. ఆ చెప్పేదేదో నా కర్థమయ్యేలా....పోనీ ఏమీ చెప్పొద్దు. మాట్లాడకుండా పడుకోండి. ఇలాంటి అర్థంగాని మాటలు చెప్పి నన్ను హడలగొట్టద్దు? లేకపోతే అత్తయ్య దగ్గరికెళ్ళి పడుకొంటాను." రాధ కోపంగా ఒత్తిగిలి పడుకుంది.

కేశవ రాధని దగ్గరికి తీసుకుంటూ అడిగాడు!" ఇవ్వాళ్ళ కొత్త చీరెందుకు కట్టావు?" రాధ మాట్లాడలేదు.

"చెప్పు రాధా!"

"ఏం చెప్పను. కొత్త చీరెందుకు కట్టుకుంటారు?"

"అదే అడుగుతున్నాను, చెప్పు. ఎందుకు కట్టుకున్నావు?"

"ఇదివరకు కట్టుకున్నప్పుడల్లా ఇలా అడిగారా!"

"లేదు. నా కా ప్రశ్న తట్టలేదు. పోనీ యిప్పుడు చెప్పు."

"మీరు చూస్తారని కట్టుకున్నాను."

"నేను చూస్తే నీకేం వస్తుంది?"

రాధ జవాబు చెప్పకుండా వుండిపోయింది.

"మరి నువ్వు చూస్తావని నే నెప్పుడన్నా కొత్త బట్టలు కట్టుకున్నానా ?"

దానికీ రాధ మౌనం వహించింది.

"నేను ఇంటికి రాకపోతే ఏం చేసేదానివి ?"

"హాయిగా నిద్రపోయేదాన్ని ఈపాటికి"—రాధకి విసుగేసింది.

"ఈ చీర నేను రాకపోతే ఎవరు చూస్తారు ?"

"ష్ ! రామచంద్రా ! మీకు దెబ్బ తగలటం నా ప్రాణాలమీద కొచ్చింది. చెప్పేవాడికి చాదస్తమైతే వినేవాడికి వివేకం వుండాలట ! కావాలంటే రాత్రంతా జాగారం చెయ్యండి, నన్ను మాత్రం వేధించకండి. ఒంట్లో జ్వరంగావుంటే ఏమిటీ వాగుడు ?"—రాధ వెనుదిరిగి పడుకుంది.

"నేనంటే నీకు ప్రేమ కాని, నువ్వంటే నాకు జాలికూడా."

రాధ కళ్ళుమూసుకు పడుకుంది. ఎంత మాట్లాడించినా లాభం లేకపోయేసరికి కేశవ విసుగెత్తి వూరుకున్నాడు. రాధని దగ్గరకు తీసుకుని నిద్రపోయాడు.

తెల్లారింది. జ్వరం తగ్గలేదు. కాలిబాధ ఎక్కువైంది. అలాగే రిక్షాలో హాస్పిటల్ కెళ్ళి కట్టు మార్పించుకుని జ్వరానికేదో మందుతాగి వచ్చి పడుకున్నాడు. ఆరోజు లంఖణం ! మూడోనాడు కేశవ తల్లి కంగారుపడింది. ఆస్పత్రి కెళ్ళే కొడుకుని వారించింది. "చాల్లే యిక ధర్మాస్పత్రి వైద్యం. లోభికి ఖర్చెక్కువని శాస్త్రం చెప్పినట్లు ముందే మంచి డాక్టరుదగ్గరి కెళ్తే ఈపాటికి హాయిగా తిరిగేవాడివి. ఈ శీత గాలిలో జ్వరాలొచ్చినా, దెబ్బలు తగిలినా ప్రాణాలమీద కొస్తుంది .... మూడు రోజుల్నుంచీ తిండిలేదు. నీరసం వస్తుంది. నువ్వేళ్ళొద్దు. ఇంటాయన కొడుకుని బతిమాలి పంపిస్తాను, డాక్టరుగార్ని తీసుకురమ్మని. వాళ్ళ నాన్నగారికి జబ్బుచేసినప్పుడు వైద్యం చేసినాయన చాలా అనుభవం గల మనిషి....నువ్వెళ్ళి పడుకో—" అంటూ కేశవ తల్లి గదిలోంచి వెళ్ళిపోయింది.

డాక్టరొచ్చి కేశవని పరీక్షించి, ఇంజక్షన్‌చేసి, మందులు రాసిచ్చి వెళ్ళాడు. కాలికట్టు మార్చటానికి రెండుమూడు రోజులకోసారి ఆస్పత్రికే

రావాలన్నాడు. ఆ సాయంత్రం మందులు కొనుక్కొని ఆస్పత్రికెళ్లి కట్టు కట్టించుకొచ్చాడు కేశవ. మర్నాటికైనా జ్వరం తగ్గినట్టు కన్పించలేదు.

రాధ ఏదో పనిమీద గదిలోకొస్తే దగ్గర కూర్చోమన్నాడు కేశవ. రాధ మౌనంగా కూర్చుంది పక్కన. కొంతసేపటికి మౌనాన్ని ఛేదిస్తూ అన్నాడు కేశవ—

"నాకీ జ్వరం తగ్గదేమో అనిపిస్తుంది రాధా!" రాధ దూరంగా చూపు తిప్పింది.

"నాతో మాట్లాడటం నీ కిష్టం లేదేమిటి? ఐతే వెళ్ళు."

"ఇదొకటి తెలుసు మీకు. ఆనాటి సాయంత్రం నుంచి ఈ క్షణం వరకూ ఇదే గొడవ. వినేదానికి నా కెలావుంటుంది? ఈమాత్రం జ్వరాని కిలా పెట్టుకొని పైవాళ్లని వేధించటం సమంజసంగా లేదు నాకు. మీకు త్వరలో తప్పక నయమవుతుంది. ఇంతమాత్రాని కెందుకిలా అశుభాలు పలుక్కుతూంటారు? జ్వరాలూ జబ్బులు మనుషులకి రాకపోతే మానుల కొస్తాయేం? నేను వెళ్తాను. మీరు అతిగా ఆలోచించక పడుకోండి" రాధ లేచి నిలబడింది. కేశవ తిరిగి అన్నాడు—

"నే నేది ఆలోచించినా నాగురించి కాదు రాధా! నీ...."

"ఇప్పుడు నాకేం వచ్చింది? శుభ్రంగానే వున్నాను"—అంటూ రాధ విసురుగా వెళ్లిపోయింది.

"సుస్తీగా వున్నప్పుడు ఎక్కువగా భార్యాభర్తలు దగ్గిరుండ కూడ దంటా రమ్మాయ్! నువ్వు వాడి గదిలోకి అంతగా వెళ్ళకు. మందదీ నే నిస్తుంటాను" అంది కేశవ తల్లి కోడలు వంటగదిలోకి వచ్చాక— ఆ క్షణం నుంచీ రాధ తరచుగా కేశవకి కన్పించటం మానేసింది.

* * *

పెద్ద డాక్టరుగారి చేతిలో పడ్డాకకూడా కేశవ జ్వరం తగ్గటం లేదు. హాస్పిటల్ కెళ్ళలేకపోవటంవల్ల కాంపౌండర్ వచ్చికట్టుకట్టి వెళుతున్నాడు రెండు మూడు రోజుల కొకసారి. విలువైన మందులు వాడుతున్నా జ్వరం

తగ్గకపోవటం డాక్టర్‌కి కొంచెం ఆశ్చర్యమేసింది. రోజూ వచ్చి శ్రద్ధగా చూస్తున్నాడు.

కేశవ మేలుకు వున్న ప్రతిక్షణం ఆలోచిస్తూ వుంటాడు. కళ్లు మూసుకుని—నిద్రలో ఆలోచనలే రూపుదాల్చినట్టు కలలు కంటాడు.

రాధ! పాపం! రాధ! ఎంత మంచిదీ! తను లేకపోతే ఏమై పోతుంది? ఎలా వుంటుంది? తను సజీవంగా వుంటేనే తన నీడన రాధ పువ్వులా పరిమళిస్తుంది. లేకపోతే — తను చచ్చిపోతే — పాపం ఎలా వుంటుంది? రాధ నీ లోకం ఒక వ్యక్తిగానే చూడదు. అప్పుడు రాధ ఏకాకి. ఎవరితో గడుపుతుంది జీవితమంతా? బ్రతకాల్సిన కాలమంతా ముందేవుంది. రాధని ఎల్లకాలం తనలా ఎవరాదరిస్తారు? పుట్టింటి కెళ్ళి పోతుందా? ఛ, ఏమిటీ ఆలోచన్లు ...?

మనస్సు నిష్కల్మషంగా వుంచుకోవాలని ప్రయత్నిస్తున్నకొద్దీ వోడిపోతున్నాడు కేశవ. అదే దృశ్యం! బాణంలా దూసుకొచ్చిన లారీ. క్షణంలో తప్పిపోయిన చావు! ఏం జరిగిందో తెలీకుండా నడిరోడ్డులో కూలబడిపోయిన తను! రక్తసిక్తమై పోయిన పాదం! అబ్బా? ఎంత ఘోరమైన దృశ్యం! క్షణంలో ఏర్పడిపోయింది. తన చుట్టూ గుంపు! ఆ లారీ మీదనుంచి పోయివుంటే వాళ్ళమధ్య తన మృతకళేబరం!.... భయంగా బాధగా కళ్ళు మరీ మూసుకున్నాడు కేశవ.

బాహ్య పరిసరాలు చూడటానికే బాధపడుతున్న కేశవ, మనో నేత్రంతో తన వూహలకి రూపు కల్పించుకుని ఆలోచిస్తూ—వాటిని చూస్తూ వుండిపోయాడు. ఆరోజు తను వచ్చేసరికి నిండుగా ముస్తాబై వుంది, పిచ్చిరాధ! తన్నే నమ్ముకుంది. తనెప్పుడు నట్టేట్లో ముంచుతాడో ననైనా ఆలోచించదేం?

ఓనాటి రాత్రి రెండుచేతులూ తన గుండెలమీద పెట్టి అడిగింది.

"ఈ గాజు లెలా వున్నాయి? చేతులు నిండుకున్నాయని అత్తయ్య వేధిస్తే వేయించుకున్నాను మధ్యాహ్నం. మీరు కనిపెడతారేమో అనుకున్నాను. మాట మాత్రమైనా అడగలేదు. మీకు నచ్చలేదా?" అంది తన కళ్ళలోకి చూస్తూ.

అనా డెందుకో తను అలకలో వున్నాడు.

"నన్నడక్కు. నీ గాజు లెలావుంటే నాకేం ?"—తను విసురుగా రాధ చేతులు తోసేసి పక్కకు తిరిగి పడుకున్నాడు. పాపం రాధకి కోపం రాలేదు. పైగా తనని కితకితలు పెట్టి నవ్వించేసింది. తన హృదయం మీద పడుకుని కళ్ళలోకి చూస్తూ అంది—

"నా గాజు లెలావున్నా మీ కవసరంలేదూ ? కాదు. నే చెప్తున్నానా వినండి. ఈ గాజులు మీవి. ఈ బొట్టుమీది. ఈ పువ్వులు మీవి. నా సౌభాగ్యం అంతా మీది. మీరే నేను కదూ ?"

"అవును నేనే నువ్వు రాధా !" అంటూ తను రాధని గాఢంగా హృదయానికి హత్తుకొంటే రాధ పువ్వులా నలిగిపోయింది. ఆ రాధ తనది.

కాని తను లేకపోతే ఎవరిది ? రాధ యవ్వనమంతా ఏమైపోవాలి ? రాధ సౌందర్యాన్ని ఎవరు చూడాలి ? పాపం రాధ! రాధ సరదాకి అప్పు డప్పుడూ తనచేత బొట్టు పెట్టించుకుంటూ ఉంటుంది. రోజూ పూలు పెట్టించుకుంటుంది. తను లేకపోతే రాధకి బొట్టెవరు పెడతారు? పూలెవరు తెస్తారు ? అయ్యో ! అసలు తను లేకపోతే రాధకి బొట్టెందుకు ? ఎంత ఘోరం! రాధ బొట్టే పెట్టుకోదు ! తన కోసమే మానేస్తుందన్నమాట. రాధ నుదురు తళతళలాడుతూవుంటుంది. ఆ నుదురు అందంగావుంటుంది. ఆ నుదురుమీద కుంకుమ ఉదయ భానువిలా ప్రకాశిస్తుంది.

తన వల్లే రాధ అందమైన కుంకుమకి దూరమవుతుందా ? అది తనకి పాపం కాదా ?

రాధకి పువ్వు లెంతో ఇష్టం. అఖరికి పిచ్చిపిచ్చి గడ్డిపూలు కూడా పెట్టుకొనేది. వాళ్ళ వూళ్ళో రాధ జడలో పూలు—ప్రత్యేకంగా ఎర్ర గులాబీలు మరీ కాంతిగావుంటాయి—వాలుజడ వేసుకు వుల్లాసంగా తిరిగేరాధ—పూలు పెట్టుకోటం మానేసి ముడివేసుకుంటుందా ? అయ్యో రాధా ! నన్ను నమ్ముకున్న నీకేం ఫలితం దక్కుతుంది ? జరగబోయే దేమీ రాధ ఊహించటంలేదా ? తనకి జబ్బుచేసింది కదూ ఇప్పుడు ? తగ్గుతుందీ అసలు....?

ఆలోచనలోనే కునుకు పట్టింది. కలత నిద్రరో కల మెదిలింది. తెల్లటి బట్టల్లో ఒక యువతి ఎటో దీనంగా చూస్తూ నిలుచుంది. చేతులెత్తి శూన్యంలోకి నమస్కరించింది. గాజులు గలగల మనలేదు. నెమ్మదిగా నడిచి వచ్చింది దగ్గరికి. మట్టెల చప్పుడు కాలేదు. బాగా దగ్గరికొచ్చాక రూపు తెలిసింది. అచ్చు రాధలా వుంది. అదే పోలిక. కాదు. రాధే! మరి తన రాధ ఇలా వుందేం! మొహాన బొట్టులేదు. ముడిలో పూలులేవు. మెడా, చేతులూ బోసిగా వున్నాయి. రాధ కాంతి విహీనంగా వాడిపోయింది. రాలిపోవటానికి సిద్ధంగా వుంది—ఒక్కసారిగా కళ్ళు మూసుకొని అగాధంలోకి వురికేసింది.

"రాధా!....రాధా"—కెవ్వుమన్నాడు కేశవ భయపడిపోయి.

"ఏమండీ? నే నిక్కడే వున్నాను. ఎందుకలా పిలిచారు ఏమండీ!" రాధ కేశవ పక్కలో కూర్చుని మొహంలోకి చూస్తూ ఆదుర్దాగా అడిగింది. కేశవ వులిక్కిపడినట్టు కళ్ళు తెరిచాడు. తన మీదికి ఒంగివున్న రాధ మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు. ఆనందంగా చూశాడు. "రా రాధా! నువ్వు....రాధా!"

"అవును, నేనే రాధని. ఎందుకలా కలవరించారు? భయమేసిందా?" రాధ అనునయంగా కేశవ చెంపలు నిమురుతూ అడిగింది.

"రాధా! నువ్వు యిలాగే వున్నావా? ఐతే నాకు కల వచ్చిందా!" కేశవ కళ్ళనుంచి వేడినీళ్ళు కారుతూంటే రాధ పైటచెంగుతో తుడుస్తూ అంది మందలింపుగా.

"అస్తమానూ ఒకే ఆలోచనల్లో ఉంటారు. అందుకే అలాంటి కలలొస్తాయి. డాక్టరుగారు మీ మనసుకు విశ్రాంతి వుండాలన్నారు. మీ రెంతమాత్రం వినిపించుకోవటం లేదు."

కేశవ రాధని చేతుల్లో ఇముడ్చుకున్నాడు. జారిపోయిన పెన్నిధి దొరికినట్టు ఆప్యాయంగా—

"నీమీద పీడకల వచ్చింది రాధా! ఎంతో భయమేసింది. నువ్వు తెల్లబట్టల్లో దీనంగా...."

రాధ చటుక్కున కేశవ నోటికి చెయ్యి అడ్డంపెట్టింది. "మీరీ

ధోరణి మానకపోతే ఈ జ్వరం మరి తగ్గదు." కటువుగా అనేసి కేశవ చేతులు తప్పించుకుని లేచి నుంచుంది.

మౌనంగా మందు కలిపి యిచ్చింది.

"అమ్మ ఏదీ ?" అన్నాడు కేశవ మందు అందుకుంటూ.

"తల నొప్పిగా వుందని ఇందాకే పడుకున్నారు. నిద్ర పట్టిందిలా వుంది. మీకు మందు ఇచ్చేవేళయిందని నేనే వచ్చాను. ఇంతలో మీరు భయంగా ...." కేశవ మందుతాగి గ్లాసు అందిస్తే అందుకుని స్టూలుమీద పెట్టి కిటికీ దగ్గరకెళ్ళి నుంచుంది.

"ఇలా వచ్చి కూర్చో రాధా ! నన్ను తప్పించుకు తిరుగుతున్నావు కదూ ?"

రాధ క్షణం ఆలోచించింది. కటువుగా చెప్పేకంటే, మృదువుగా చెప్పితే లాభం వుంటుందనుకుంది. వచ్చి కేశవ పక్కలో కూర్చుంది. ఏదో చెప్తున్నాడు రాధ వింటూవుంది. కేశవ ఒళ్ళు చాలా వేడిగావుంది దుర్భరంగావుంది. కేశవ చెప్పేది వినటంకూడా బాధగావుంది.

"ప్రొద్దుపోయింది. మీరు పడుకోండి. మీ అమ్మగారు భోంచెయ్యకుండానే పడుకున్నారు. లేపాలి—ఇన్ని రోజుల్నుంచీ మీరు లేకుండా మే మిద్దరం తినటం ఏమిటోలా ఉంది" రాధ లేచి గదిలోనుంచి వెళ్లిపోయింది. కేశవ కళ్ళు మూసుకొని తిరిగి ఆలోచనాతరంగాల్లో మునిగిపోయాడు.

"తనంటే ప్రాణాలిస్తుంది రాధ. రాత్రింబవళ్ళు చాకిరీచేస్తూ వాడిపోయింది. పైకెంతో బింకంగా వుంటుంది. కనీసం కళ్ళవెంట నీళ్ళయినా పెట్టుకోదు. తనే దిగులుపడితే బాగుంటుందేమో. అటువంటి రాధకి తనిచ్చే ప్రతిఫలం ఏమిటి ? అదృష్టం సరిగా లేకపోతే రాధ సర్వనాశనమై పోతుంది. నిలువునా రాధని నాశనం చెయ్యటానికి — శాశ్వతంగా రాధని శాంతి సౌఖ్యాలకి దూరం చెయ్యటానికి తనకేం హక్కుంది ? స్త్రీ సహజాలంకారాలైన పసుపు-కుంకుమ లెందుకు మానుకోవాలి ? రాధ బొట్టు చెరపటానికి, పూలు చెరపటానికి తను హక్కుదారా ? రాధని వుసూరుమనిపించి ఆఖరికి ఆత్మహత్యకి పురికొల్పేది తనా ? రాధని చచ్చి

సాధించటానికి తనెవరు ? రాధ భర్త! ఐతే మాత్రం సుఖపెట్టాలిగాని కష్టపెట్టటం తన బాధ్యతా ? ఛ! అదిఘోరం! అన్యాయం! ఏదో ఆచారం అనే పేరుతో ఒకరి జీవిత కష్టసుఖాల్ని మరొకళ్ళకి శాశ్వితంగా అంట గట్టటం అన్యాయం గాకపోతే ఏమిటి ? ఇరవై ఏళ్ళు నిండని పసి రాధ తనకి బలికావటం మానవత్వం నిండివున్న తనకి — హృదయమున్న తనకి ఘోరంగా వుంటుంది. తనుంటే తన భార్య రాధ సుఖపడుతుంది. అది గొప్పకాదు తను లేకపోయినా సుఖపడనివ్వాలి. తను రాధని గాఢంగా ప్రేమించటం నిజమైతే — రాధ మీద తనకి సానుభూతికూడా వుంటే— తనలో పరిపూర్ణమైన మానవత్వం వుందని గర్వపడాలంటే —నిదర్శనంగా రాధని సుఖపడనివ్వాలి. తన రాధ జీవితాంతం శాంతి సౌఖ్యాలతో.... పిల్లాపాపతో ...." కేశవ కళ్ళు నిండాయి తృప్తిగా, తేలిగ్గా కళ్ళు మూసు కున్నాడు.

రెండు వారాలు తిరిగాయి. పరిస్థితి ఎప్పటిలానే వుంది. కాలిమీద దెబ్బ మానుపట్టింది. కాని జ్వరం, కలవరంతలూ డాక్టర్నికూడా బాధపెడు తున్నాయి. కేశవ తలనొప్పిగా వుందంటే రాధ మందు మర్దనచేస్తూ కూర్చుంది దిగులుగా. కేశవ ఒళ్ళు సలసలా కాలిపోతున్నది. రాధ భయపడిపోయింది. కన్నీళ్ళు చాటుగా తుడుచుకుంది కేశవ రాధని చాల దగ్గరికి తీసుకున్నాడు. రాధ కన్నీళ్ళు కేశవ బుగ్గలమీద పడ్డాయి. "ఎందుకు రాధా భయం ? నాకేం ఫర్వాలేదన్నావుగా?"

"మిమ్మల్ని చూస్తే నిజంగా భయంగా వుంది. డాక్టరేమో ప్రత్యే కంగా జబ్బేమీలేదని చెప్పారు నాకు తెలుసు. మీరు అర్థంలేని ఆలోచ నలతో నీరసించి పోతున్నారు. మనసు స్థిమితంగా వుంచుకుంటే ఏనాడో నయమైపోయేది. నామీద ప్రేమ ఉందంటారు. ఇదేనా ? నా గురించి మీరు తిరిగి ఆరోగ్యంగా తిరగాలని కోరుకోవటం లేదా? నా బ్రతుకు నాశనం చెయ్యటం మీకిష్టంగా వుందా చెప్పండీ ? నన్నేం చెయ్యాలని మీ ఉద్దేశం ?" రాధ నిలేసి అడిగినట్టు అడిగింది. కేశవ రాధ చేతిని గుండెలమీద పెట్టుకున్నాడు.

"నేను ఆరోగ్యంగా వుండటం జరిగితే ఇద్దరికీ సంతోషమే రాధా!

లేకపోతే నాతోపాటు నాశనం కావద్దు. ఇరవై ఏళ్ళయినా నిండని నీకు అన్యాయం జరగదు రాధా! నేను చెప్పినట్టు విను...." కేశవ ఆగాడు. రాధ వింటూ వూరుకుంది.

"నువ్వు రెండో పెళ్ళి చేసుకో."

రాధ విస్తుబోయింది. వెర్రిగా చూడసాగింది.

"ఆశ్చర్యపడకు రాధా! అదేం తప్పుకాదు. అన్ని విధాలా ఆలోచించాను. నేనే నిన్ను అజ్ఞాపిస్తున్నాను. నా దారి నేనుపోతే ఇప్పట్నుంచీ నువ్వెలా బ్రతకాలి? నా గుర్తుగా పోనీ ఒక్క పిల్లవాడైనా వుంటే...."

రాధ మొహంలో కోపం పొడసూపింది. విసురుగా లేచివెళ్ళి పోయింది.

కేశవరావు రాధ పైట చెంగు పుచ్చుకొని వదలకుండా ఆజ్ఞాపించినట్టు కటువుగా అన్నాడు.

"కూర్చుని నేను చెప్పేది విను."

రాధ కూర్చుండిపోయింది. "మీరిలా మాట్లాడుతూవుంటే నాకు భయంగావుంది" అంది, భయంగా నేల చూపులు చూస్తూ. కేశవ సహజంగా అన్నాడు—

"నాకేం తెలివి తప్పలేదు. సెన్స్‌లోనే వుండి మాట్లాడుతున్నాను. నేనంత క్రూరమైన మనిషిని కాను. అర్థంలేని ఆచారాలు నేను పాటించను. నేను వుంటే సరేసరి. లేకపోతే తప్పక నువ్వు పెళ్ళిచేసుకోవాలి నువ్వు సుఖపడడమే నేను కోరేది— మాట్లాడు రాధా!"

రాధ మాట్లాడలేక పోయింది. కేశవ ధోరణికి భయపడింది. కొంతసేపు మౌనంగావుండి హటాత్తుగా తట్టినట్టు అడిగింది— "నేనే చచ్చిపోతే మీరేం చేస్తారు?"

కేశవ క్షణం ఆలోచించాడు. తన జవాబు మీదే రాధ నిర్ణయం ఆధారపడివుందని అనుకున్నాడు. అతి నిర్లక్ష్యంగా అన్నాడు— "తప్పక రెండో పెళ్ళి చేసుకుంటాను."

రాధ గతుక్కుమంది. తెల్లబోయింది. ఎటో చూస్తూ వుండి పోయింది.

"ఆ ప్రసంగం ఇప్పుడు అనవసరం రాధా! నీకు ఆరోగ్యంగా వుంది కాబట్టి ఆ ప్రశ్నేలేదు. జరగవలసింది నీ భవిష్యత్తు. నేను....

"నేను మొగరాయుణ్ణిగాను, రెండు మూడు పెళ్ళిళ్ళు చేసుకోటానికి....నాకు నీతీ, ప్రేమావున్నాయి" విసురుగాలేచి దూసుకెళ్ళిపోయింది. కేశవ తెల్లబోయాడు.

"పిచ్చిరాధ! పోయినవాళ్ళకోసం జీవితాలు నాశనం చేసుకుని జీవచ్ఛవాల్లా గడపటం ప్రేమకి నిదర్శనమా" అనుకున్నాడు కళ్ళు మూసుకుని.

* * *

కేశవ తల్లి డాక్టరుగార్ని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది....

డాక్టరు ఫర్వాలేదన్నట్టు అతి నిర్లక్ష్యంగా అన్నాడు.... "అబ్బే! ఏం ఫర్వాలేదమ్మా! మరో నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది, ఈ సీజన్‌లో జ్వరాలు నిలవచేస్తాయి...."

"మీ చేతిలోవున్నాక మాకు భయం లేదు. ఆ విషయం మీరు.... కేశవ తల్లి అతివినయంగా అంది.

డాక్టర్ ఆదుర్దాగా అన్నాడు...."ఏమని కలవరిస్తాడమ్మా? ఈ కేస్ నాకు కొంత రిస్క్‌గా వుందని తీవ్రంగా ఆలోచిస్తున్నాను. మనసులో ఏదో వేదన లేకపోతే పరిస్థితింతగా వుండేది కాదు. అతనికేదైనా బెంగలాంటి వున్నాయేమో చెప్పగలరా?" గుమ్మంలో వింటూ నుంచుంది రాధ. కేశవతల్లి పొడిగా అంది—

"వాడికేం బెంగ వుంటుందడీ? నాకు తెలిసినంతవరకు అలాంటిదేం లేదని.... కలవరింతలుకూడా వివరంగా తెలీవండీ? రాధా....రాధా.... అంటూంటాడు."

"మనకి తెలిసినా, తెలియకపోయినా వాటివల్ల పెద్దగొడవలే జరుగుతుంటాయి. రోగికి మనస్సేమాత్రం నిశ్చలంగా లేకపోయినా జబ్బు మళ్ళదు సరికదా ప్రమాద పరిస్థితులుకూడా ఏర్పడుతుంటాయి— సరే! మీరేం భయపడనవసరంలేదు. మీరన్నట్టు కేశవరావుకి అలాంటి బెంగ

వుండటానికి కూడా అవకాశాలేం లేవనుకుంటా. ఇవాళ నెమ్మదిగా కదిపిచూస్తాను....కొంచెం వేడినీళ్ళు...." ఇంజక్షన్ పరికరాలు రెడీ చేసుకోవటంలో నిమగ్నుడయ్యాడు డాక్టర్. కేశవ తల్లి లోపలికెళ్ళింది.

రాధ ఆలోచించింది. మనస్సులో బెంగవుంటే జబ్బు మళ్ళదట. పోనీ, ఆ విషయాలు డాక్టరుగారికి చెప్తే....?

"డాక్టరుగారూ!...."

డాక్టరు రాధకేసి అనునయంగా చూశాడు. రాధ తల దించుకుంది.

"ఏమ్మా?"

"ఆయన ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటారండీ...." రాధ ఆగింది.

"ఆ ఆలోచనేమిటో నీకు తెలుసామ్మా? తెలిస్తే ఫర్వాలేదు, నిర్భయంగా చెప్పు. నీతో ఏమైనా అంటూంటాడా?"

రాధ చొరవగా డాక్టరుగారి మొహంలోకి చూసింది....

"నే....బ్రతకను. నేను చచ్చిపోతాను. నేను లేకపోతే నీ జీవితం సర్వనాశనమైపోతుంది. నువ్వు సుఖంగా వుండటమే నాకు కావాలి. నువ్వు రెండో పెళ్ళి చేసుకో. అంతేగాని నా పేరుమీద వుదాసీనంగా బ్రతకొద్దు—నేను లేకపోతే నిన్నెవరు చూస్తారు?"—ఇలా అస్తమానం అంటూవుంటారండి. లారీప్రమాదం తప్పిపోయిన దగ్గర్నుంచీ ఈ ధోరణి మొదలుపెట్టారు. తప్పని ఎంతచెప్పినా విన్పించుకోరు. మేలుకు వున్నంతసేపూ ఏదో ఆలోచిస్తారు. నిద్రలో నేను తెల్లచీరలు కట్టుకున్నట్టు కలలు వచ్చాయంటారు."

రాధ చెప్తున్నది వింటూ డాక్టర్ తెల్లబోయాడు. ఆశ్చర్యపడ్డాడు.

"కేశవరావు విశాలమైన హృదయం కలవాడమ్మా...." అన్నాడు తేరుకుని.

"మీరూ అలాగే అంటారా డాక్టరుగారూ? ఆయనకి నేను జవాబు చెప్పలేకపోతున్నాను. ఎంత ప్రయత్నించినా ఆ ప్రసంగంలోంచి మళ్ళించలేక పోతున్నాను," రాధ దీనంగా అంది....డాక్టరు చిరునవ్వు నవ్వాడు.

"అలా యెప్పుడూ ప్రయత్నించ కూడదమ్మాయ్! రోగులకి మొండితనం కూడా అలవడుతుంది. వాళ్ళమాటకి ఎదురాడకూడదు. వాళ్ళేంచెప్పినా వినితీరాలి. వాళ్ళ మనసు శాంతంగా వుంచటమే మన పని. వాళ్ళకి ఆరోగ్యం చక్కబడ్డాక అన్నీ మర్చిపోతారు.

"నువ్వేం చెయ్యాలంటే అతనేం చెప్పినా వినాలి. మీ యిష్టం వచ్చినట్టే ప్రవర్తిస్తానని చెప్పు. దీంట్లో నీకు నష్టమయ్యే దేంలేదు. అతన్ని శాంతపర్చుకో. త్వరలో తప్పక జ్వరం నయమవుతుంది. ఏమ్మా!" డాక్టరు ఆప్యాయతగా చూశాడు రాధని.

"అలాగేనండి"—రాధ కృతజ్ఞతగా చూసింది.

డాక్టరు గదిలోకెళ్ళి కేశవకి ఇంజక్షనిచ్చాడు. మృదువుగా మాట్లాడుతూ.

"డాక్టరుగారూ! కొంచెం ఈవిడకి చెయ్యిచూడండి—ఈ మధ్య బొత్తిగా నీరసంగా వుంటున్నది." అంటూ కేశవ తల్లి, కోడల్ని గురించి చెప్పేసింది, రాధ వారిస్తున్నా వినిపించుకోక.

డాక్టరు రాధని పరీక్షించాడు .... "అబ్బే! అనారోగ్య మేం కాదమ్మా! నీరసంగా మాత్రం వుంది. బహుశా ఈ మధ్య అతనికి పరిచర్యలవీ చెయ్యటం మూలాన ఐవుంటుంది. ఒక టానిక్ రాసిస్తాను. తీసుకుంటుంటే బలంగా వుంటుంది." అని చీటీ రాసిచ్చి వెళ్ళిపోయాడు—
"ఆయన పూర్తిగా కోలుకునేవరకూ డబ్బుసరిపోకపోతే ఎట్లా అత్తయ్యా? నాకేం టానిక్కులు కావాలి? మరేం ఫర్వాలేదు. ముందు ఆయన్ని తిరగ నివ్వండి" అంటూ చీటీ కిటికీలో పడేసింది రాధ.

ఈ మధ్య తనకి ఒంట్లో ఎందుకు బాపుండటంలేదో రాధకి అర్థమైంది. అత్తగారు కనిపెట్టేవరకూ చెప్పకూడదనుకుంది. కేశవకి చెప్పాలనుకుంటూనే చెప్పడానికి బిడియబడేది. అస్తమానం కడుపులో దేవుతూ వుంటుంది. ఒక్కోసారి వికారం ముంచుకొస్తుంది. మనిషంతా తూలిపోతున్నట్టుంటుంది. అప్పుడప్పుడూ తలనొప్పి వస్తూనే వుంటున్నది. వీటన్నిటికీ కారణం రాధకి తెలుసు. చేతి నాడీ—నాలుకా—కళ్ళూచూసిన

డాక్టరుకేం తెలుస్తుంది? పైగా మనసుకు నెమ్మది లేకుండా కేశవధోరణి విశ్రాంతిగా వుండటానికి కుదరకుండా కేశవకి కాస్తోకూస్తో పరిచర్య చెయ్యటం, అందుకే అసలే సన్నగావుండే రాధ నీరస పడిపోయింది.

ఆ రాత్రి రాధ కేశవ పక్కన డాక్టరు చెప్పిన మాటలు మననం చేసుకుంటూ కూర్చుంది. ఆయనెంత అసమంజసంగా మాట్లాడినా తనెదురు చెప్పకుండా అంగీకరించి ఆయన్ని శాంతి పర్చాలట. ఆయన కేమిటో తగని చాద స్తం పట్టుకుంది. పోనీ అలాగే అంటే ఏంపోయిందీ? తన సంగతికూడా ఆయనకి ఇవ్వాళే చెప్తే? ఏమో బాబు! ఎలా చెప్పటం? ఐనా ఇంతనీరసంలో ఇలాంటి శుభవార్త చెప్తే, దాన్నిగురించి ఇంకెన్ని ఆలోచిస్తారో! పుట్టబోయే పాపకి తండ్రినిచూసే భాగ్యం ఉండదని.... ఒకవేమిటి పాడు ఆలోచనల్నీ ఎలా పుడుతున్నాయి? అదీ అంతే. అలాంటి మనిషి కూడాను. బాగుపడ్డాక చెప్పొచ్చు. ఇరవై రోజుల్నుంచీ దాచగాలేంది మరి నాలుగు రోజులు....

"ఏమిటి రాధా! తెగ ఆలోచిస్తున్నావు?"

రాధ చిన్నగా నవ్వుతూ వూరుకుంది.

"నువ్వీమధ్య బాగా చిక్కిపోతున్నావు రాధా! బెంగ పెట్టుకొని అన్నం సరిగా తినటం లేదేమిటి?''

రాధ నవ్వింది—"బావుంది మీ అనుమానం, అన్నం ఎందుకు తినను? నే నొకప్పుడు మహా లావుగా వున్నానా?....నాకు బెంగెందుకూ? ఆ బెంగలూ, బాధలూ మీకే ఉంటాయి."

"నువ్వు ముందుచూపు చూడవు రాధా! గడచి గట్టెక్కి పోయా ననుకుంటావు. అందుకే నీకు బెంగగావుండదు. ఐనా నువ్వు బెంగ పెట్టుకోవాల్సిన అవసరంకూడా లేదులే. ఏది జరిగినా నీకు లోటు రాకూడదు. ఇలాగే నువ్వు కలకల్లాడుతూ వుండాలి. నిజంగా నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. నాతోపాటు నీ సౌభాగ్యం అంతం కాకూడదు రాధా!...." రాధ ఒళ్ళో తలపెట్టుకు పడుకున్నాడు కేశవ.

రాధ, కేశవ తల మృదువుగా నిమురుతూ అంది. "మీరు మన స్ఫూర్తిగా కోరితే తప్పకుండా మీ ఆజ్ఞగా అలాగే చేస్తాను. నా ఘంగళ

చిహ్నాలన్నీ మీ గుర్తుగా వుంచుకుంటాను...." రాధ కాసేపు మౌనంగా కేశవ మొహంలోకి చూస్తూ ఊరుకుంది. "మీకింత విశాలమైన హృదయం భగవంతుడు యెలా ప్రసాదించాడు ? నేనంటే ఇంత దయెందుకు ?"

"ఇది నా గొప్పేమీ కాదు రాధా ! నిజంగా నా కోరిక చిత్రమైంది గానే కన్పిస్తుంది లోకానికి. కాని నాకు న్యాయంగా, ధర్మంగా తోచింది. నేనెంత స్వార్థపరుణ్ణి కాను రాధా ! దయామయుడైన భగవంతుడు నాకీ మనసివ్వకపోతే అందరిలాగే నువ్వూ వుండిపోతావు. జీవితాంతం నా పేరుమీద కృశించిపోతావు. పోయినవాళ్ళతో పోతామా ? సాధ్యమైనంత వరకూ కష్టాల్ని మరచిపోయి సుఖాల్ని ఆహ్వానించాలి. లేకపోతే ప్రతివ్యక్తికీ బ్రతుకుభారమౌతుంది. అమ్మతో, మీవాళ్ళతోకూడా చెప్తాను. నా కోరిక చెప్పటమేకాదు. అలా జరిపించాలని ఆజ్ఞాపిస్తాను. నువ్వు...."

రాధ కా ధోరణి విపరీతంగా వుంది. డాక్టరుగారి ఉపదేశం గుర్తొచ్చి నిగ్రహించుకుంది. కేశవని మాట తప్పిస్తూ అంది—"సరే ! నేను మీ ఇష్టప్రకారం చేస్తానన్నాను కదా ? ఇక అ ప్రసంగం ఆలోచించకండి—ఈ రాత్రి హాయిగా నిద్రపోండి. మంచిది"

కేశవ చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు. "నాకిప్పుడు చాలా తేలిగ్గా గర్వంగా వుంది రాధా! నాశనంగాబోతున్న ఒక ఆడదాన్ని ఉద్ధరించానని—శాశ్వతంగా సుఖం ప్రసాదించాననీ భావన కల్గుతున్నది రాధా ! కాదంటావా ?"

"నిజం. ఎదుటి వాళ్ళని దయగాచూస్తే భగవంతుడు మనని దయగా చూస్తాడు. సరే, ఇక మీరు పడుకోండి. నాకూ నిద్దరొస్తూంది." రాధ లేచి కేశవకి దుప్పటి కప్పి లైటు తగ్గించి రెండో మంచంమీద పడుకుంది. కేశవకి తెల్లవారేసరికి చాలా తేలిగ్గా వుంది. జ్వరం తగ్గకపోయినా మనసంతా ఒళ్ళంతా హాయిగా వుంది. పదిహేను లంఖణాలు చేసినట్టే అనిపించలేదు. లేచి గదిలో నెమ్మదిగా తిరగాలనిపించింది కూడా. లేచి కిటికీ కానుకుని నించుని బయటికిచూస్తూ ఉండిపోయాడు.

"ఏమిట్రోయ్ ? లేచి పచార్లుకూడా చేస్తున్నావు తేలిగ్గా ఉందన్న

మాట. ఆఁ....." గదిలో ప్రవేశించిన డాక్టరు సంభ్రమంగా నోరు తెరిచాడు. రాధ వెనకే నవ్వుతూ నిలబడింది.

"అవును డాక్టర్! చాలా ఆరోగ్యంగా వున్నట్లుంది. నాకు సూదిపోట్లక్కర్లేదండీ" కేశవరావు మంచంమీద కూర్చుంటూ నవ్వాడు.

"ఆహా! అంతవరకూ వచ్చిందీ? రాత్రికి రాత్రి నీకీ వైద్యం ఎవరు చేసేశారోయ్?" డాక్టరు రాధకేసి నిగూఢంగా నవ్వుతూంటే రాధ తలదించుకుంది.

డాక్టరు సర్దాగా మాట్లాడుతూ కేశవకి ఇంజెక్షనిచ్చి వెళ్ళిపోయాడు.

కేశవ మర్నాడు పత్యం తీసుకున్నాడు. రాధ చేతులెత్తి భగవంతుడికి నమస్కరించి సూత్రంతీసి కళ్ళకద్దుకుంది. మరి రెండు రోజులు ఓపిక పట్టింది.

రాధ మరివుండబట్టలేక ఆ రాత్రి శుభవార్త కాస్తా కేశవ చెవిలో ఊదేసింది. కేశవకి ముందు ఏం విన్నాడో అర్థంకాలేదు. నెమ్మదిగా గ్రహింపైంది. నమ్మలేనంత ఆశ్చర్యం కలిగింది. వెనువెంటనే ఆనందం పెల్లుబికింది. మూగగా రాధ కళ్ళతో మాట్లాడబోతే రాధ దోసిట్లో ముఖం దాచుకుంది. కేశవ రాధ చేతులు తీసేస్తూ మొహంమీదికి ఒంగి అడిగాడు—

"నాకు విన్పించలేదు రాధా! మళ్లా చెప్పు!"

రాధ మూతిబిగించుకు వూరుకుంది.

"ఏయ్! నిన్నే, ఏమిటా ఊరింపు? నాకు సరిగా వినపడందే?"

"ఉత్తది, వినకపోతే అంత కంగారెందుకు? ఇక నేను చెప్పను"

"చెప్పు రాధా! చెప్పవూ?"

"ఊహూ."

"ఐతే నువ్వూ నేనూ జట్టుకాదు."

"మానెయ్యండి" రాధ నవ్వింది.

కేశవకి కోపం వచ్చేసింది— "ఐతే చెప్పవన్నమాట?"

"చెప్పను, చెప్పను, అసలు చెప్పను."

"ఐతే నా పక్కలో ఒద్దు వెళ్ళు."

రాధ నవ్వింది.

"నీకు కాదేంటి చెప్పేది? వెళ్ళు! నాకు నిద్దరొస్తోంది."

కేశవ వెనుతిరిగి పడుకున్నాడు.

రాధ బెట్టుగా అంది — "ఇష్టం లేకపోతే మీరే వెళ్ళాలి" ఇది నా మంచం."

నిజం. అది రాధ పుట్టింటినుంచి తెచ్చుకున్న అందమైన పందిరి మంచం.

కేశవకి పౌరుషం పొడుచుకొచ్చింది. తక్షణం లేవబోయాడు. రాధ లేవనీకుండా పట్టుకుంది. నవ్వి అంది — "సంతోషించాం పౌరుషానికి. ఇక శాంతించండి."

"అక్కర్లేదు, నా మంచంమీదే పడుకుంటాను."

కేశవ తిరిగి లేవబోయాడు.

రాధ మళ్ళా వారించి అంది—"అబ్బా! మనిషికి ఏం వచ్చినా పట్టలేం. మీ రడిగింది మళ్ళా మళ్ళా చెప్తాను పడుకోండి. నేనంటే జాలి కదూ మీకు?"

కేశవ లేవటం మానేసినా అటుతిరిగి కళ్ళుమూసుకు బెట్టుగా పడుకున్నాడు.

"ఏమిటో మీ కోపం, ఇప్పుడు నే నేమన్నాననీ?" అంటూ రాధ కేశవకి కితకితలు పెట్టింది. కేశవ చటుక్కున రాధని చేతుల్లో ఇముడ్చుకున్నాడు. మొహం దగ్గరికి లాక్కుని అన్నాడు—"మరిప్పుడు చెప్పు."

"మనకి పాపాయి...." రాధ కిలకలా పలికింది.

కేశవ చటుక్కున రాధని ముద్దు పెట్టుకున్నాడు.

"మళ్లా."

"మనకి పాపాయి—మనకి చిన్న పాపాయి" రాధ నవ్వింది.

"ఈ శుభవార్త ఆనాడు నేను కొత్తచీర కట్టుకున్నప్పుడే చెప్పాల్సింది! అనుకోకుండా ఇంత ఆలస్యమైపోయింది. మీరు జ్వరం పడితే నాకు చెప్పటానికి నోరురాలేదు. అబ్బా! ఎంత హడలుగొట్టేశారు బాబూ ఆ జ్వరంలో. ఏమాత్రం అధైర్యస్థులైనా మీముందు పనికిరారు. కాపరాని

కొచ్చి రెండేళ్ళయింది. కానీ మీకు తలనొప్పి రావడంకూడా ఎరగను. నాకూ తగని భయం వేసిపోయేది మీ ధోరణికి. నన్నంత వేధించి నందు కసలు మీతో మాట్లాడకూడదు.''

రాధ కోపం నటించింది.

"కాదు రాధా! నేను జ్వరంలో వుంటేమాత్రం తెలివితప్పి మాట్లాడానా? అప్పటి అభిప్రాయాలు ఎప్పుడూ వుంటాయి. వాటిని నువ్వెప్పుడూ నిర్లక్ష్యం చెయ్యొద్దు. నువ్వు...."

"ఇక చాలు. మళ్ళా ఆ ప్రసంగం ఎత్తితే అంతుండదు — దాని కేంగాని, మరి చెప్పండి. మీకేం పాపాయి కావాలి?"

కేశవ క్షణం ఆలోచించాడు—"పాప అచ్చు నీలా."

"కాదు బాబు అచ్చు మీలా.''

"అయితే మాను."

"ఏమిటి మానేది?'' రాధ నవ్వింది. జత కలిపాడు కేశవ.

రాధ నెలలు నిండాక పురిటికి పుట్టింటికొచ్చింది. నిండు గర్భవతి రాధ. అస్తమానం అత్తింటినీ, భర్తనీ – తనకి పుట్టబోయే పాపాయినీ– పాపాయి రూపురేఖల్ని తల్చుకుంటూ కూర్చునేది. సంతోషంతో మురిసి పోయేది. మరుక్షణంలోనే ఏవో శంకలతో – అనుమానాలతో దిగులు పడేది.

అటువంటి పరిస్థితిలోనే ఒకనాటి రాత్రి సుఖంగా ప్రసవించింది. మత్తుగా పడివున్న రాధకి ఏం పాపాయి పుట్టిందో కూడా తెలీలేదు. తెలివి వచ్చేసరికి పురిటిగది నిశ్శబ్దంగా వుంది. నాయనమ్మ, అక్క– గడపలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

గది కిటికీలు మూసెయ్యటంచేత చీకటిగావుంది. పాపాయి తన ప్రక్కనే నిద్రపోతూంది. మంచానికి కాస్త దూరంలో ఎత్తు పీటమీద దీపంబుడ్డి వెలుగుతూంది. రాధ అప్రయత్నంగా పాపాయికేసి చూసింది. ఎవరి పోలికో అంతుపట్టలేదు ఆ పాపాయి ముద్దలా పడివుంది.

రాధ చిత్రంగా చూస్తూ వుండిపోయింది. ఏం పాపాయో తెలుసు కోవాలని హృదయం ఆరాటపడుతోంది, కాని అడగటానికి సిగ్గుపడింది.

అప్పుడే రాధ అక్క- రాధకి మెలుకువ రావటం చూసి నవ్వుతూ అంది – "కూతుర్ని చూసుకుంటున్నా వేమిటి రాధా? తెల్లగా నీ లానే వుంది. వాళ్ళ నాన్న పోలికేమో అనుకుంటున్నాను. ఏం నాయనమ్మా?"

తిరిగి అక్కా, నాయనమ్మా కబుర్లలో పడిపోయారు.

రాధకి ఆశ్చర్యం వేసింది. ఆనందం కూడా కల్గింది. ఆయన మొదట్నుంచీ అంటూనే వున్నారు. తనకి పాపే కావాలని, తన పంతమే నెగ్గుతుందనీ. అలాగే జరిగిందే. తెలిస్తే ఎంత సంతోష పడతారు! తనకి కూతురు! తను అమ్మ. ఆయనో? భలే–ఆయన నాన్నయ్యారన్నమాట. ఇంత చిన్న పాప తమని అమ్మా! నాన్నా! అని పిలుస్తుందా? పాప తన రంగూ – ఆయన పోలికా? అయితే రంభలా వుంటుంది – పాపని చూడాలని వుండదూ ఆయనకీ? తను వోడిపోయినందుకు తన్ని వెక్కిరిస్తారేమో–రాధ ఆలోచిస్తూనే పాప బుగ్గలు తడిమి ముద్దుపెట్టుకుంది.

రాధ సుఖంగానే ప్రసవించినా పురిట్లోనే జబ్బు చేసింది. పథ్యం పెట్టిన నాడే జ్వరం తగిలింది. పల్లెటూరి మందుల్తో వైద్యం సాగించబోతే సుస్తీ ఎక్కువైంది. ఇంటిల్లపాదీ కంగారు పడ్డారు. రాధ అత్తవారి వూరు టౌన్ కావటంచేత రాధనీ, పాపనీ మేనాలో అత్తగారింటికి తీసుకెళ్ళిపోయారు. పాప పుట్టిందని తెలిసి సంతోష పడుతున్న కేశవరావుకి రాధకి జబ్బు చెయ్యటం చాలా బాధ కలిగించింది. తనకి జ్వరంలో ట్రీట్ చేసిన డాక్టర్ని చాలా అనుభవంగలవాడని రాధ వైద్యానికి ఏర్పాటు చేశాడు. రాధ తల్లీ, అక్కా వాళ్ళుకూడా రాధతోనే వచ్చారు—తక్షణం డాక్టర్ నర్స్‌తో వచ్చి రాధని పరీక్షించి తృప్తిగా గాలిపీల్చాడు–"మరేం భయంలేదండీ! బాలెంతలకి సాధారణంగా ఇలా సుస్తీ చెయ్యటం పరిపాటే. త్వరలో ఆరోగ్యవంతురాలవుతుంది .... అన్నట్టు ఈ నాలుగు రోజులూ పాపకి వేరేపాలు పట్టడం మంచిది...."

డాక్టరి మాటలు ఇంటిల్లపాదికీ చల్లగా తోచాయి. మనసుల్లో భయం తగ్గింది .... రాధకి ఆ వాతావరణం ఆలోచన్లు రేకెత్తించింది. ఏడు నెలలక్రితం సరిగా ఇలాగే ఆయనకి జ్వరం వచ్చి గొడవ ఐంది.

ఈ డాక్టరుగారే రోజూ వచ్చేవారు. ఆయన మంచంలోపడి పిచ్చి పిచ్చిగా వాగటం ఆ ధోరణికి తను భయపడిపోవటం నిన్నో మొన్నోలా వుంది. ఏమిటీ తనకంత బాద స్తమెపోయిం దిప్పుడూ? 'నే బ్రతకను— నీ జీవితం పాడై పోతుంది—రెండో పెళ్ళి'చేసుకో రాధా...." అంటూ ఒకటేగొడవ. కాస్త జ్వరం వస్తేనే చచ్చిపోతారా?....ఐతే తనకిప్పుడు జబ్బు చేసింది మరి.... నయంగాదా? అమ్మో! తను చచ్చిపోతే .... రాధ గుండె దడ దడ లాడింది. ఎంతో భయం అనిపించింది. ఆలోచన్లు సాగకుండా మన సంతా అర్థంలేని జంకుతో అల్లల్లాడి పోయింది.

పాపలేచి సన్నగా ఏడుస్తూంటే రాధ వూహల్లోంచి బయటపడి పాపని దగ్గరికి తీసుకుని పాలివ్వ బోయింది. పాప ఏడుపు విని లోపలి కొచ్చిన అక్క— రాధని వారిస్తూ అంది.... "నాలుగురోజుల పాటు పాపకి వేరేపాలు పట్టమని చెప్పారే డాక్టరు .... నీ పాలు జబ్బు చేస్తాయేమో పాపకి .... ఐనా ఆ గుక్కెడు కాఫీనీళ్ళకి నీ దగ్గిర మాత్రం అప్పుడే ఏం పాలుంటాయి? పాపకి పాలు తీసుకొస్తానుండు ...." అంటూ అక్క— గది లోంచి బయట కెళ్తూవుంటే రాధ అయోమయంగా చూస్తూ—

తన పాలు తాగితే పాపకి జబ్బు చేస్తుందా? అంటే తనకి బాగా జబ్బు చేసిందా? డాక్టరు గారలా చెప్తారు? నిజమేనేమో— తనకీ ఒంట్లో ఏమీ ఆరోగ్యంగాలేదు. కడుపు బాధ! ఏదో నీరసం! తనకింత జబ్బు చేసింది కదా —అసలు తగ్గుతుందా ? తగ్గకపోతే? అమ్మో .... జబ్బు నయంగాకపోతే తప్పకుండా .... రాధ భయంగా కళ్ళు మూసుకుంది. నుదుటిమీద అరచెయ్యి ఆన్చి వుంచుకుంది.

"అదేం రాధా! తలనొప్పిగా వుందా?"

రాధ కళ్ళు తెరిచింది. అక్క— పాపకి పాలు తెచ్చింది. పట్టిస్తూంటే నీరసంగా చూస్తూ పడుకుంది రాధ. పాప ఈ లోకంలోకి వచ్చి ఆరు రోజులు. పసిపాప, దాని కిప్పుడు తల్లెవరో తెలుసా? ఎవరు పాలిచ్చినా

తాగేస్తుంది. అంతకంటే దానికేం గావాలి? కడుపునిండితే చాలు. రాధకి పాపని చూస్తుంటే ఏదో ఆనందంతో కడుపు నిండిపోయినట్టయింది.

అక్క పాపని తిరిగి రాధ పక్కలో పడుకోబెట్టి ఈమాట చెపుతూ రాధకి మందు కలిపి ఇచ్చింది. రాధ సంశయిస్తూనే అడిగింది — "ఇంత పొద్దుపోయింది ఆయనింకా రాలేదాక్కా——"

"లేదే — వచ్చాక చెప్తాలే. ఇప్పటివరకూ కూతుర్ని చూడలేదనుకుంటానే. నేను స్నానం చెయ్యాలి. అమ్మను పంపుతాను. పడుకో" అని అక్క వెళ్ళిపోయింది.

రాధ కళ్ళు మూసుకు పడుకుంది. తాగిన మందు చెడ్డ చేదుగా వుంది. కడుపులో దేవుతూంది. ఏమిటో స్థిమితం లేదు. ఈ వారం రోజుల్నుంచీ తాగుతున్న మందులకి అంతేలేదు. పైగా బాధలూ! ఎందుకింత కష్టపడి ఈ పిల్లల్ని కనటం? ఎందుకొచ్చిన రంధి ఇదంతా? అందుకే ఆడదై పుట్టేకంటే అడివిలో చెట్టో పుట్టో అవటం అదృష్టం అంటారు— మగవాళ్ళకేం? రాజాలా తిని తిరుగుతారు హాయిగా. ఎవళ్లెలా పోయినా పట్టదు— కాకపోతే తనొచ్చి రెండు రోజులైంది. కొంచెం లోపలికొచ్చి చూశారా? పాప ఎలా వుంటుందో చూడాలని బుద్ధి పుట్టటం లేదూ? అదీ గాక తనకి సుస్తీ చేసింది. ఎలా వుందని అడక్కూడదూ? ఆయన జ్వరంలో వుంటే తనెంత చాకిరీ చేసిందీ? ఐతేయేం? మగవాళ్ళ కలాంటివన్నీ గురికూడా వుంటాయా? తనుపోతే.... ఇంకొకతె——" రాధకావూహ చెళ్ళుమని చరిచినట్లయింది — గుండె గుబ గుబ లాడింది. తనకేదో జరిగిపోతున్నట్టనిపించింది! గోడకేసి వెర్రిగా చూస్తూ వుండిపోయింది.

తలుపు చప్పుడైంది. రాధ చూసింది. కేశవ తలుపులు మూసి లోపలకొచ్చాడు. రాధని చూసి చిరునవ్వు నవ్వాడు. రాధ తిరిగి నవ్వలేకపోయింది. నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయింది.

"ఎలా వుంది రాధా?" అంటూ కేశవ రాధపక్కన కూర్చోబోతే రాధ తప్పనిసరై వారిస్తూ అంది—— "వేరే కూర్చోండి."

కేశవ నిర్లక్ష్యంగా అన్నాడు— "ఆఁ, సింగినాదం ఈ కాలంలో ఇంకా అంటేమిటి? డాక్టర్ ముట్టుకోవటంలా?.... "

రాధ వూరుకుంది. కేశవ పాపకి కప్పిన గుడ్డలు ఒత్తిగించి ఆత్రుతగా పరీక్షిస్తుంటే రాధకి నవ్వు వచ్చింది.

"నా పంతమే నెగ్గింది రాధా!" అన్నాడు కేశవ పాప బుగ్గలు వేళ్ళతో తాకి.

రాధ వూరుకుంది.

"ఈసారి నీ పంతం నెగ్గించుకుందువుగానిలే. మాట్లాడవేం రాధా?"

రాధ నిష్ఠూరంగా అంది— "ఇప్పటికి గుర్తొచ్చాం కాబోలు, వచ్చి రెండు రోజులైతే...."

"అదేమిటి రాధా! అలా అంటావ్? నిన్నటికి నిన్న హడావిడిగా వచ్చాను .... డాక్టర్ని తీసుకురావటం అదీ అయ్యేసరికి ఆఫీసు టైమై పోయింది. రాత్రి అమ్మా వాళ్ళంతా ఇక్కడ తిష్టవేస్తె కుదరలేదు — నాకెంత ఆత్రుతగా వుందో తెలుసా పాపని చూడాలని? నీకు జబ్బు చేసిందని తల్చుకుంటే ఎంత బాధనిపిస్తుందీ?....భలేగా మాట్లాడుతున్నావే!"

"ఇంత పొద్దుపోయాక వచ్చారు. ఎక్కడెక్కడ .... ఎప్పుడైనా మీరిలా వచ్చారా?"

కేశవ నవ్వాడు—"ఏం మనిషివి రాధా? చిత్రంగా అడుగుతున్నావ్. ఇంటికొస్తే సర్దాగా నీతో మాట్లాడటానికి వీలుండదు .... ఒక్కణ్ణీ వీధిగదిలో కూర్చోవాలి....ఏం తోస్తుంది? అందుకే కాస్సేపలా ఫ్రెండ్సుతో తిరిగొచ్చాను. అదీ నీకు కోపంవస్తే చిక్కే .... భలేదానివి రాధా! గడుసుదనం నేర్చుకున్నావేమిటి కొత్తగా? ఇంతకీ నీ కెలా వుంది!" కేశవ రాధ ఒంటిమీద చెయ్యివేసి చూస్తూ అన్నాడు—"అబ్బా! చాల వేడిగావుంది... మరేం పర్వాలేదు. డాక్టరు చాలా తెలిసినవాడు. నా జ్వరం తగ్గిపోలా? నువ్వేం భయపడకు మరి నేను వెళ్ళి స్నానం చేస్తాను."

కేశవ ఓదార్పుతో రాధ మనసు తేలికపడలేదు. ఎందుకో మనసంతా వేదనగావుంది. తనకి చాలా జబ్బుచేసింది? అంతా తనని వోదార్చటా రెందుకు? తన కింత సుస్తీగా ఉండి ఇంటిదగ్గిరుంటే ఆయనంత

హుషారుగా ఫ్రెండ్సుతో ఎలా తిరగ కలిగారు ? అబ్బా ! ఏమిటో తనకి నిద్రపట్టినా బావుండును. ఇదేం జబ్బో ! సరిగా నిద్రరాదు....రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రాధకి రెండు మూడు రోజులకి కూడా జ్వరం తగ్గలేదు. అసలే సన్నగా ఉండే రాధ మరీ సన్నబడింది. బాగా నీరస పడిపోయింది—క్షణం లేచి కూర్చున్నా కళ్ళు తిరుగుతున్నాయి. పాపని వేరే పడుకో బెట్టారు. పాప గొడవ రాధకేం లేదు—అసలు రాధకి ఏదోబాధ — భయం తప్ప మరో ధ్యాసలేదు—రాధ మెదడులో ప్రవేసించిన అనుమానం ఇంతై అంతై కొండంతై చెదపురుగులా మనిషిని తొలిచివేస్తున్నది — అట్టడుగున పడిపోయిన విషయాలన్నీ మెదుల్తున్నాయి—బాలెంత జబ్బు—చాలా ప్రమాదమట—త్రాచు కాటులా అందుకుంటుం దంటారు — పాపం రాజం పిన్ని రెండోకోడలి కిలాగే పురిట్లో జబ్బుచేసి క్షణంలో ఎగిరిపోయింది — దాని కొడుకు వుసూరుమంటూ తిరుగుతూంటాడు — తనుపోతే .... తన పాప; అమ్మో" రాధ మనసు ఎండిపోయిన ఆకులా అల్లాడిపోయింది.

"తనకి మంచి డాక్టరు వైద్యం చేస్తున్నాడు. అలా ఎందుకు భయ పడాలి!....ఐతే రాజంపిన్ని కోడలు వైద్యం లేకనేపోయిందా ? పుట్టింటి వాళ్లెంతో ప్రేమగా పెద్ద పట్నం తీసికెళ్ళారు — గొప్ప డాక్టర్లు వైద్యం చేశారట....ఆగిందా ! ఆయువు విండితే డాక్టర్లేం చెయ్యగలరు. అలాగే తనూ....ఇంత జబ్బులోంచి బయటపడుతుందా ? అలా అనుకుంటే తనని మభ్యపెట్టటమే....తను బ్రతకటం అనుమానం .... అంతేకాదు, చావటం ఖాయం—అయ్యో తన పాప ! ఎవరు చూస్తారు దాన్ని ? తల్లిని కరువు చేసుకున్న పాపెలా బ్రతుకుతుంది—" రాధ భారంగా కళ్ళు తెరిచి పాపనిచూసి తిరిగి కళ్ళు మూసుకుంది .... కన్నీళ్ళు తుడుచుకోలేక పోయింది.

"ఆయన కెలా వుంటుంది తను లేకపోతే ? పాపం బాధ పడరూ? జీవితమంతా ఎలా గడుపుతారు ?.... మరో పెళ్ళి....ఆ....రెండో పెళ్ళి చేసుకుంటారా ? నిజంగా తనే లేకపోతే ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా !"

"తప్పక మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు—" రాధ త్రుళ్ళిపడింది. ఆయన జ్వరంలో ఆ మాటే అన్నారు. తన కామాట ఎన్నోసార్లు గుర్తొచ్చింది. "ఆఁ ఏదో జ్వరం అలా అన్నారు" అని తోసిపారేస్తూవచ్చింది. కాని అదే నేడు జరగనున్నది.

"నీకు ఆరోగ్యం బాగానేవుంది. ఇప్పుడా ప్రశ్నేలేదు రాధా?" అనికూడా అన్నారు—మరి తన కిప్పుడు జబ్బుచేసింది—ఆ ప్రశ్నకిప్పుడు అవకాశం వుంది — ఆయన అభిప్రాయాలు మొండిగా వుంటాయి. వాటికి మార్పు వుండదు.... తప్పక పెళ్ళి చేసుకుంటారు.

"అయ్యో! భగవంతుడా! నా కప్పుడే నూరేళ్లూ నిండిపోయాయా ప్రభూ!" రాధ మనసు ఆక్రోశించింది—తను మరి వుండదు—తనని మర్చిపోతారు – మళ్ళీపెళ్ళి చేసుకుంటారు హాయిగా. తన స్థానంలో మరో ఆడది .... అబ్బా! నిజంగా అలా జరుగుతుందా? ఆయన స్వయంగా చెప్పినపుడు జరక్కేం చేస్తుంది? — ఎవరా అదృష్టవంతురాలు? ఈ భాగ్యమంతా తనదే అనుకుంది—ఆయన తనకే అంకితమైపోయారని మురిసిపోయింది .... తమ బంధం అలా శాశ్వతంగా వుండిపోతుందని ఆశపడింది. తన కేశవ తనని ప్రాణాలకన్నా మిన్నగా ప్రేమించాడని గర్వపడింది....ఆ వూహలన్నీ అపోహలేనా! అయ్యో! ప్రభూ!....

తలుపు తెరుచుకుని అక్క లోపలికొచ్చి దీపం వెలిగించింది. వెనువెంటనే కేశవ డాక్టర్‌తో లోపలి కొచ్చాడు. డాక్టర్ కేశవతో ఏదో ఇంగ్లీషులో మాట్లాడుతూ రాధకి ఇంజక్షన్ ఇచ్చాడు—తర్వాత ఇద్దరూ బయటికెళ్ళిపోయారు. రాధ భుజం పట్టుకొని పడుకుంది—పది నిమిషాల్లో కేశవ లోపలికొచ్చి రాధ దగ్గిర కూర్చుంటూ అన్నాడు—

"జ్వరంతప్ప వేరే చెప్పుకోదగ్గ జబ్బేమీ లేదంటున్నారు రాధా!.... మరి రెండు రోజుల్లో నయమై పోతుందట .... ఈ పదిరోజులకీ ఎంత చిక్కిపోయావ్ రాధా! నువ్విలా వుంటే నాకేం తోచటంలేదు...."

రాధ ఏదో పోగొట్టుకున్నట్టు చూసించి కేశవ మొహంలోకి చూస్తుండగానే రాధ కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి—సన్నటి వేళ్ళలో మొహం దాచుకుంది.

"ఛ ! ఏమిటి రాధా ? ఇంత దిగజారిపోయావు. ధైర్యంగా ఉండా లని ఎంతో చెప్పేదానివికదా ? నీకేం ఫర్వాలేదు రాధా ! డాక్టరు చాల ధైర్యంగా చెప్తున్నారు....ఎందుకలా వెర్రిగా చూస్తావు; నీ కేమిటి బాధ ? నాకు చెప్పు...." కేశవ రాధ కళ్లు తుడుస్తూ చాల ధైర్యం చెప్పాడు. రాధ చాలా సేపు ఏమీ మాట్లాడలేదు.

"నిజంగా నాకు తగ్గిపోతుందని చెప్పారా డాక్టరుగారు ?" ఉన్న ట్టుండి అడిగింది.

"నిజం రాధా ! నీకు నమ్మకంలేదా ? ఉత్త జ్వరమేనట....నిజం గాకపోతే నేను ఊరుకుంటానా ? తల తాకట్టుపెట్టయినా పట్నం తీసి కెళ్తాను...నువ్వు నిశ్చింతగావుండు....చూడు, పాప యెలా నిద్రపోతు న్నదో, అచ్చు నీ పోలిక కదూ ?"

"ఏమో నాకు తెలీటంలేదు మీ పోలికే అంటుంది అక్క" రాధ నీరసంగా నవ్వింది. కేశవ చాలా సేపు కూర్చుని కబుర్లు చెప్పాడు. రాధ వింటూ నిద్రపోయింది.

పరిస్థితి ఎప్పటిలానే వుంది రాధకి నీరసముమీద వచ్చిన జ్వరమనీ —దానివల్ల ప్రమాదమేమీ వుండదనీ అంటున్నాడు డాక్టరు — డాక్టరు మాట లెవరూ నమ్మలేకపోతున్నారు. ఉత్త జ్వరమైతే తగ్గటమంటూ ఉండదేమిటి ? నమ్మినా నమ్మకపోయినా చేసేదేమీలేదు. ఇంజెక్షన్లూ మందులూ ఎప్పటిమోస్తరే — రాధ మనస్సుకూడా సాగిన రబ్బరులా యధాస్థానంలోకి వచ్చేసింది — ఎవరి మొహంలో చూసినా ఉదాసీనత గోచరిస్తూంది—పోనీ జ్వరమైతే మాత్రము తగ్గిపోతుందా జ్వరంలో పోయిన వాళ్లెంతమంది లేరు.

పెళ్ళయి మూడేళ్ళయింది. తనిక్కడి కొచ్చేవరకూ ఆయన అక్కడ కొస్తూండేవారు. అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఏదో వైతు

క్కుంటున్నట్టు దిగితే తను విసుక్కొనేది. అది చూసి ఆయనకి కోపం వచ్చేది. వెళ్ళిపోతానని లేస్తే తను కాళ్లావేళ్లా బడి ప్రతిమాలుకొనేది ఇంకెప్పుడూ అననని లెంపలేసుకునేది....ఆయన్ని శాంతపరిచేసరికి తల ప్రాణం తోక కొచ్చేది....ఎప్పుడూ ఆయన అలగనదీ—తను ప్రతిమాలనిదీనూ! కాని ఆయన మనను చాలా సున్నితం ఇట్టే కరిగిపోతారు .... తర్వాత ఎంతగా లాలిస్తారు? రాధా! అనిపిలవటానికివిసుగుండదు—తనకి గుర్తున్నంతవరకూ ఆయన పూలుతేని రోజంటూ లేదు—ఆయనే జడలో పెడితే తప్ప తనకి పెట్టుకోవాలని ఉండదు. ఆయనకి చిన్నబొట్టు — లేతరంగు చీరలూ—ఎర్ర గులాబీలూ ఎంతో ఇష్టం. తనకి వాటిమీద ప్రత్యేకమైన అభిరుచి లేకపోయినా తను వాటిని ఇష్టం చేసుకుంది .... ఎందుకో ఆయనకి పూలచీర లిష్టముండవు. ఒకసారి తనకి బాగా గుర్తు. నలుపుమీద తెల్లటి చుక్కల చీర కట్టుకుంటే అది విప్పేవరకూ నానా గొడవా చేశారు....తనెంతో ఇష్టమై ఏరుకుంది ఆ చీర....పోనీ తన కిష్టమైంది ఆయన కూడా ఇష్టం చేసుకోకూడదూ? అలా అంటే విన్పించుకోలేదు.... చేసేదిలేక అక్క కిచ్చేసింది. మొండి మనిషి—తన మాట నెగ్గి తీరాలి....తగని చిలిపితనం.... అది భరించలేక ఒక్కొకసారి తనకి కోపం వచ్చేది....ఏదో మునిగిపోతున్నట్టు గావుకేకలు పెడితే తను పరుగెత్తుకొస్తుంది. వచ్చేసరికి ఆయన ఏదో వ్యాపకంలో మునిగిపోయినట్టు నటించటం! "ఎందుకూ పిలిచారూ!" అంటే-

"ఎవరూ? నేనా! చ....లేదే...." అనేసి తన పనిలో నిమగ్నమైపోతే తనకెలా వుంటుంది? "మీరిప్పుడు పిలవలేదూ!" అని నిలేసి అడిగితే "అబ్బే! నువ్వలా మీ ఆయన పిలిచినట్టు కలగంటున్నావేమో!"— తనకి నిజంగా వుక్రోషం వచ్చేసేది....

"అత్తయ్యకూడా విన్నారు మీరు పిలవటం.... పిలుస్తానుండండి" అంటూ తను కోపంగా వచ్చేస్తుంటే చటుక్కున వచ్చి పట్టుకుని "వద్దు రాధా! నిన్ను పిలిచాను. ఒప్పుకుంటున్నా కదూ? ఒకటి అడగాలని పిలిచాను."

"ఏమిటది?" తనెంతో కోపంగా అడిగేది ....

"అర్జెంటుగా ఒక ముద్దు ఇచ్చుకుంటావా? పుచ్చుకుంటావా ?"

అంత కోపంలో తనకి నవ్వు వచ్చేదే....ఐనా బెట్టుగా "ఏదీలేదు" అని రాబోతూంటే "అలా వీల్లేదు మరి." అంటూ "తన పెదవులమీద...."

ఆ జ్వరంలో రాధ ఎండిపోయిన పెదవులమీద అప్రయత్నంగా మందహాసం చిందింది మధుర స్మృతుల్ని తల్చుకుంటూ పొడారిపోయిన పెదాల్ని తడుపుకుంది – తను జబ్బులో వున్నానని గుర్తొచ్చింది. మనసు చివుక్కుమంది తను నిద్రపోతున్న అనుమానం మేల్కొంది .... తను తల్చుకున్నదంతా ఏనాడో జరిగిపోయింది....జరగబోయేది తన చావు— ఆయన పెళ్ళి ....అబ్బా! ఆ సంగతి తెలిసికూడా తన గుండెలు బద్దలైపోకుండా వున్నాయంటే తన దెంత మొండి ప్రాణం! "తప్పక రెండో పెళ్ళి చేసుకుంటాను" కేశవ గర్జన.

అవును చేసుకుంటారు ... అలా చేసుకోవద్దని అడిగితే?....బావుంటుందా? ఆయన జీవితం గడపవద్దూ? అప్పుడు తనకోసం, తన భవిష్యత్తుకోసం ఎంత కలవరించారూ? తన సౌఖ్యం కోసం ఏ మగవాడూ కోరని కోరిక కోరారు–భార్య రెండో పెళ్ళి చేసుకోటం ఏ మగవాడు సహిస్తాడు! కాని ఆయన తన మీద ప్రేమతో—జాలితో–తన బ్రతుకు బాగుపరచాలనే సానుభూతితో స్వార్థరహితంగా ఆలోచించారు....ఆయన నిర్ణయం అంగీకరిస్తేగాని జ్వరం మళ్ళిందిగాదు....అటువంటి మనిషిని ఇంత స్వార్థంగా మూర్ఖంగా తనెలా అడుగుతుంది? ఇరవై యేళ్ళు నిండని ఆడదానికే గడవనప్పుడు పాతికేళ్ళు నిండిన మగవాడికి గడుస్తుందా ? అసలు తన కలా అడగటానికి నోరెలా వస్తుందీ?

ఐతే ఆయన పెళ్ళిచేసుకోటం ఖాయమేనా? ఈ ఇంట్లో ఈగదిలో మరో ఆడది తిరుగుతుందా? ఆయన రోజూ పువ్వులుతెచ్చి ఆవిడ తలలో పెట్టి ముందుకు తిప్పుకొని ముద్దు పెట్టుకుంటారు....ఆవిడతో ఆటలాడుకుంటారు – ఇద్దరూ కలిసి షికారెళ్తారు. సినిమాలు చూస్తారు.... రాధనే మనిషి కొన్నాళ్ళీ గదిలో తిరిగిందనే సంగతే మర్చిపోతారు .... రెండో పెళ్ళాం అపురూపంగా వుంటుందని పెద్దలే చెప్పారు .... ఇంకా తను జ్ఞాపకం వుంటుందా ? పాప! అయ్యో చిన్నారి తల్లి! ఏమైపోతుంది ?

ఎవరు చూస్తారు దాన్ని? అమ్మా అని ఎవర్ని పిలుస్తుంది? ఆయన పాపని చూస్తారా? ఆవిడ చూడనిస్తుందా? తన పాపకి తల్లి కరువవుతుందా! సవతి తల్లి దగ్గర పెరగాల్సిన గతి పడుతుందా? తండ్రి వుండీ లేనివాడవుతాడా? "పాపా! నన్నీ లోకంలోకి ఎందుకు తెచ్చావమ్మా? నాదారి నేను చూసుకుంటే నీ గతేమిటి పాపా?...." రాధ వెక్కి వెక్కి ఏడ్చింది తనివిదీరా.

"రాధా! ఏడుస్తున్నావా?"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది రాధ. కేశవ దీనంగా చూస్తున్నాడు తనవేపు. రాధ తిరిగి కళ్ళు మూసుకుని పక్కకు తిరిగి పడుకుంది. ఏడుపు ఆపుకోలేకపోయింది. కేశవ సముదాయిస్తున్నకొద్దీ కుమిలిపోయింది. ఒళ్ళు సలసలా కాగిపోతున్నది.... ఇంత తీవ్రమైన జ్వరంలో రాధ ఇలా అస్తమానం ఏడుస్తుంటే కేశవకి ఏమీ పాలుపోలేదు. రాధ తలని ఒళ్ళోకి తీసుకుని తలంతా మృదువుగా రాస్తూ కూర్చున్నాడు మౌనంగా....

రాధ హఠాత్తుగా అంది — "పాపని బాగా చూడండీ...."

కేశవకి అర్థంగాలేదు. రాధ కళ్ళలోకి చూశాడు. కాంతి హీనంగా వున్నాయి. ఆ కళ్ళల్లో ఎంత మెరుపు—ఎంత ప్రకాశం వుండేదీ! అందమంతా కళ్ళలోనే వుందనుకొనేవాడు. అలాంటి కళ్ళు ఇలా వాడిపోయాయేం?—"రాధా! ఏమిటి అన్నావ్? పాప కేమైంది?" అనునయంగా అడిగాడు. రాధ పేలవంగా నవ్వింది....

"పాప! ఎంతో ముచ్చట పడ్డాను....పాప బ్రతుకంతా లోటే."

"రాధా! ఏమిటీ నీ ధోరణి? నాకెంతో చెప్పేదానివే. నువ్విలా...."

"మీరు రెండో పెళ్ళి చేసుకోరూ! పాపని...."

కేశవ విస్తుపోయాడు – "ఎవరు చెప్పారు నీకు?" దాదాపు గర్జించాడు.

రాధ దృఢంగా అంది—"ఒకరు చెప్పాలా? నే నెలాగూ బ్రతకను....మీరు పెళ్ళి చేసుకుంటారు. పోనీలేండి....మీసుఖాని కడ్డురాను.... కాని పాపని—"

"రాధా! రాధా! నువ్వు తెలివిలో వుండే మాట్లాడుతున్నావా? నీ వూహలన్నీ అపోహలు రాధా! నీకంత బ్రతకలేనంత జబ్బేమీ చెయ్యలేదు. నా మాట నమ్ము నువ్వు బ్రతుకుతావు. పాపా, మనం సుఖంగా వుంటాము. నేనేదో జ్వరంలో వాగినవాగుడు నువ్వు లెక్క చేస్తున్నావా రాధా! ఇలాంటి అనుమానాలు పెట్టుకుంటే జ్వరంమళ్ళదు. నీకోసం ఎంత ఆరాటపడుతున్నానో నీకేం తెలుసు. నువ్వు భ్రమపడుతున్నావు.... నీకు జబ్బేమీ లేదు రాధా!" కేశవ ధోరణి రాధ కెంతమాత్రం నమ్మకం కలుగలేదు. "నీకంత జబ్బు చెయ్యలేదు- నువ్వు బ్రతుకుతావని మభ్యపెట్టకపోతే రెండో పెళ్ళి చేసుకోను- ప్రాణంలా చూచుకుంటాను —— అనకూడదూ?——" "జ్వరంలో అంటే మాత్రం తెలివితప్పి అన్నానా? ఆ అభిప్రాయాలు ఎప్పుడూ వుంటాయి. వాటిని నువ్వెప్పుడూ నిర్లక్ష్యం చెయ్యకు అని జ్వరం పోయాక ఆరోగ్యంగా వున్నప్పుడు మళ్ళా అనలేదూ? తన చాద స్తంగాని తననే రెండోపెళ్ళి చేసుకొమ్మని శాసించిన మనిషి తను పోతే వూరుకుంటారా? ఇంత జబ్బు చేస్తే తనింకా బ్రతుకుతుందా?

కేసవ చాలా చెప్పుకు పోతున్నాడు. రాధ వింటున్నదో లేదోకూడా తెలీదు. రాధ నిద్రపోయిందని తెలిసి కేశవ బయటికెళ్ళిపోయాడు.

మర్నాడు ఆఫీసుకు సెలవు పెట్టాడు. డాక్టరుతో రాధ జబ్బు గురించి సంప్రదించాడు. విలువైన మందులు కొన్నాడు. ఆ రోజంతా రాధ మంచందగ్గరే కూర్చుండిపోయాడు. రాధ కన్ను తెరవకుండా తీవ్రమైన జ్వరంలో పడివుంది మధ్య మధ్య ఏవో కలవరింతలు-వెక్కి-వెక్కి-ఏడవటం, ఉలిక్కి-పడ్డం కేశవకి ఎంత ఆపుకున్నా దుఃఖం ఆగలేదు. తనే ఏడిస్తే రాధ మరీ బెదిరిపోతుందని గ్రహించుకున్నాడు – ఎంత వాడిపోయింది రాధ? రాధ మొహంలోకి చూస్తూ వుండిపోయాడు బాధగా——

క్షణం రాధ కళ్ళు తెరసింది. వెచ్చటి నీళ్ళు చెంపలవెంట కారిపోయాయి. కేశవ మౌనంగా తుడిచాడు. రాధ అస్పష్టంగా, నీరసంగా గొణిగింది.... "పాప."

"పాపని కళ్ళల్లో పెట్టి చూసుకుంటాను రాధా, ఆ అనుమానం ఎంతమాత్రం రానివ్వకు...."

"మీరు మళ్ళా...."

"తప్పు రాధా! అలా అనకు.... నేను చేసుకోను .... నీకు బాగు పడుతుంది."

రాధ అపనమ్మకంగా నీరసంగా నవ్వింది—

"డాక్టరుగారు చెప్పారా? అప్పుడు నాకూ అలాగే చెప్పారు. అలా అన్నానేగాని నేను రెండో పెళ్ళి చేసుకుందునా? మీరిప్పుడిలా అంటే మాత్రం చేసుకోడం మానుతారా? ఒద్దు .... మీరు సుఖపడాలి. పోయిన వాళ్ళతో పోతామా? అన్నారుకదూ మీరే_కాని పాపని...."

"నిన్ను నమ్మించలేకపోతున్నాను రాధా!" కేశవ రెండుచేతుల్లో తల పట్టుకు కూర్చుండిపోయాడు. నిమిషాలు — గంటలు దొర్లిపోతు న్నాయ్. డాక్టర్ దగ్గిరే వున్నాడు. అంతా పరిసరాల్లో తచ్చాడుతున్నారు. మరో డాక్టరు వచ్చినా ఏమీ చెప్పలేక పోయాడు. రాధ తలని కేశవ ఒళ్ళో పెట్టుకు ఎప్పుడేం మాట్లాడుతుందోనని తదేకంగా చూస్తున్నాడు. కేశవ మనసు ఎడారిలావుంది. ఏం జరుగుతుందో వూహించుకోలేక పోయాడు. రాధ పాలిపోయిన కళ్ళు తెరచింది. అతిదీనంగా దేబిరిస్తు న్నట్లు కోరింది, "మీరు పెళ్ళి చేసుకోవద్దు. నన్ను మర్చిపోవద్దు."

కేశవకి భోరున ఏడవాలనిపించింది. వెక్కి_వెక్కి_ ఏడ్చాడు. జారిన కన్నీళ్ళు రాధ నుదుటిమీద పడ్డాయి. కేశవ తన కళ్ళనీ రాధ మొహాన్నీ తుడిచాడు. "రాధా! రాధా! ఒక్క_సారి చూడు రాధా! నీ కోరిక అక్షరాలా పాటిస్తాను రాధా! పాపని చూడు రాధా!" కేశవ కంఠం నిండిపోయింది.

రాధ మరి చూడలేదు. ఇకచూడదని కేశవకి తెలీలేదు.

"మనోవేదన...." డాక్టర్స్ ఇవ్వబోయే ఇంజక్షన్ని ఆపుచేసి బయటికి నడిచారు

కేశవ రాధ హృదయంమీద పడి బావురుమన్నాడు. పాప ఉలిక్కి_ పడి కేరుమంది. రాధ పుట్టింటినించి తెచ్చుకున్న అందమైన పందిరి మంచం బోసిగా చూసింది....

(30-9-1959 "ఆంధ్రప్రభ" వార పత్రిక నుంచి)

★